క్లుప్తంగా

రూరల్ ఎస్ఐగా పి.నిరంజన్‌రెడ్డి బాధ్యతలు


ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రూరల్ ఎస్ఐగా పి.నిరంజన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ యు.సునీల్‌కుమార్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోగా నంద్యాల జిల్లా రుద్రవరం పోలీస్‌స్టేషన్ నుంచి పి. నిరంజన్‌రెడ్డి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ పై అధికారులు, పోలీస్ సిబ్బంది, మండల ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అనంతరం సీఐ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మెరుగైన వైద్యం అందించాలి


రోగులతో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ చలపతి

ఆలూరు రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు జిల్లా ఎంపీహెచ్ఈఓ(మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) చలపతి అన్నారు. శనివారం ఆయన ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్రబలుతున్న విషజ్వరాల శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాలు మందులు ఉన్నాయా, లేదా అని డాక్టర్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరుటౌన్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వంపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ నియోజవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజైన ఈనెల 14 నుంచి 30 వ తేదీ వరకు సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రచార, పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్ సత్వర పూర్తికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, సీపీఐ నాయకులు పంపన్న గౌడ్, రంగన్న, సమీవుల్లా, బాలరాజు, సత్యన్న, తిమ్మగురుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ


కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

హొళగుంద: సుళువాయి గ్రామంలో ఉపాధి కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శనివారం సీనియర్ మేటీలు స్వంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. వేసవి తాపానికి కూలీలు అల్లాడి పోతుండడంతో ఫీల్డ్ అసిస్టంట్ కన్నయ్య ఆధ్వర్యంలో సీనియర్ మేటీలు సురేష్, గుర్రప్ప, మంజు, శంకర్‌లో మజ్జిగను తెచ్చి కూలీలకు అందజేసారు.

మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

కృష్ణగిరి: పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కర్నూలు డిప్యూటీ ఈఓ హనుమంతురావు హెచ్చరించారు. శనివారం ఆయన కృష్ణగిరి, కంబాలపాడులోని రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జ్‌లకు సూచించారు.

రన్‌ఫర్ జీసస్


రన్‌ఫర్ జీసస్‌లో క్రైస్తవులు

పత్తికొండ రూరల్: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి మార్కెట్‌యార్డు వరకు రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మండల పాస్టర్స్, స్థానిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ బంటుపల్లి శ్రీనివాసులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుమంత్‌తో పాటు పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ కరువే

- జగనన్నను మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: చంద్రబాబు నాయుడికి ఓటేస్తే గతంలో మాదిరిగా మళ్లీ కరువొస్తుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కురువపేట, లక్ష్మీపేటలో పర్యటించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులతో కలిసి ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు ఉన్న తేడాను వివరించారు. అనంతరం గృహాలకు జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లు అతికించి, కరత్రాలను చదివి వినిపించి, ప్రజా మద్దతు పుస్తకంలో అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఆయకట్టు భూములకు సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో రైతులు పంటలు బాగా పండించుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న జగనన్నపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టీ.నసురుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్ నాయుడు, కాశీరెడ్డి, మన్సూర్, బందెనవాజ్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, ధర్మకారి నాగేశ్వర రావు, కడపల వెంకటేష్, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

ఎమ్మిగనూరు టౌన్: ఏ ఇంటికి వెళ్లినా జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సొమ్ము నేరుగా తమ బ్యాంక్ అకౌంట్లలో జమ అవుతుందని మహిళలు చెప్పడంతో ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మొబైల్‌ఫోన్‌కు, గోడలకు జగనన్న ఫొటో ఉన్న స్టిక్కర్లు అతికించి లబ్ధిదారులతో టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- నందవరం: మండల కేంద్రం నందవరం, సోమలగూడూరు, నాగలదిన్నె, హాలహర్వి, జగ్గాపురం, కనకవీడు, జోహరాపురం తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, సచివాలయ జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

- పత్తికొండ టౌన్: స్థానిక 20వ సచివాలయ పరిధిలోని సవారమ్మ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ గోడలకు స్టిక్కర్లు అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు.
- కృష్ణగిరి: జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి పోతుగల్లు, జి.మల్లాపురం గ్రామాల్లో పర్యటించారు. సంక్షేమ పథకాలను ఆరా తీసి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. ప్రజలు స్వచ్ఛందంగా మిస్డ్‌కాల్ ఇచ్చి సీఎం వైఎస్ జగనకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమాల్లో సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
- తుగ్గలి: పేదల భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌తోనే ముడిపడి ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. శనివారం శభాష్‌పురం, జి.ఎర్రగుడి, పగిడిరాయిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.
- వెల్దుర్తి: పట్టణంలో పలు ఇళ్లకు సచివాలయ కన్వీనర్లు శివారెడ్డి, ఆరిఫ్ తదితరులతో కలిసి జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న మాదిగ వెళ్లి 5 రకాల ప్రశ్నలతో సమాధానాలు రాబట్టి ప్రజా మద్దతు సర్వే నిర్వహించారు. వారి అనుమతితో ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లు అతికించి మిస్డ్‌కాల్ ఇప్పించారు. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

- ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, వైస్ ఎంపీపీ శ్రీరాములు తదితరులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి గల తేడాను వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.
- ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, బిల్లేకల్లు, ములుగుందం, నగరూరు తదితర గ్రామాల్లో ఎంపీపీ సుంకర ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన్ తదితరులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.
- హొళగుంద: జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వందవాగిలి, ఇంగళదహాళ్, మార్లమడికి, నెరణికి, ఎల్లార్తి, కోగిలతోట తదితర గ్రామాల్లో సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా సభ్యులు ప్రహ్లాదరెడ్డి తదితరులు పర్యటించారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలిపేయాలి


మాట్లాడుతున్న సీమ కృష్ణ

నందవరం: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నదిపై అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపేయాలని ఆర్‌పీఎస్ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు సీమ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుల సాధనకు ఈ నెల 24న కర్నూలులో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని, అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మించడంతో రాయలసీమకు తుంగభద్ర నది నుంచి రావాల్సిన నికర జలాలు హెచ్ఎల్‌సీ, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ బైవారణి తిప్ప ప్రాజెక్టు రైతులకు రావన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టు నిర్మాణం నిలిపేయాలన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసి నీళ్ల, నిధులు, నియామకాలలో న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించనున్న దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు హరి నాయుడు, నాగభూషణం, గోపాల్, సురేంద్ర రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబన్న దాదా గంధం

హొళగుంద: మండల కేంద్రంలోని సాయిబన్న దాదా గంధం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గంధం గ్రామ ప్రధాన వీదుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి ఆదివారం ఉదయం దర్గాకు చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. గంధంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నుంచి దర్గాకు భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉరుసు, సోమవారం జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా దర్గా పక్కనే ఉన్న తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో నీరు నిండుగా ప్రవహిస్తుండటంతో అటువైపు చిన్నారులను వెళ్లనివ్వవద్దని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి

నందవరం: ఈనెల 14న ఎమ్మిగనూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతికి దళితులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు కనకవీడు రాజు కోరారు. శనివారం మండలంలోని హాలహర్వి, ఇబ్రహీంపురం, నదికై రవాడి, సజీవపురం, నాగలదిన్నె గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు, కేవీపీఎస్ నాయకులు పర్యటించారు. ప్రతి పల్లెలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ సభ్యులు మాల పూజారి నాగప్ప, సక్కరప్ప పాల్గొన్నారు.

హోరాహోరీగా గ్రామీణ క్రీడా పోటీలు


విజేత వృషభాల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న దాత ఉప్పరి కిరాణం వెంకటరమణ

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం కాడెద్దుల గిరక బండి లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి ప్రారంభించారు. 23 కాడెద్దులు పాల్గొన్న ఈ పోటీలలో కల్లూరు మండలం నాయకల్లు పంచాయతీ ఉపసర్పంచ్ షంషీర్ కాడెద్దులు విజేతగా నిలిచి రూ.20వేలు సొంతం చేసుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో దేవనకొండ మండలం కోటకొండ బలరాముడు వృషభాలు, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె మనోజ్ వృషభాలు, కోడుమూరు మండలం లద్దగిరి జీఎస్ఆర్ బుక్స్ రవి వృషభాలు నిలిచాయి. వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. తాడు లాగు పందెంలో గ్రామానికే చెందిన చింతకాయల రాజు సత్తా చాటి రూ.3 వేల నగదు బహుమతి పొందాడు. బైక్ స్లో రేసులో చనుగొండ్ల మహేంద్ర విన్నర్‌గా నిలిచి రూ.2 వేలు, రన్నర్‌గా అదే గ్రామానికి చెందిన సురేంద్ర రూ.వెయ్యి గెలుచుకున్నారు. విజేతలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, దాతలు, నిర్వాహకులు బహుమతులందించారు.

గడ్డివాములు దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివాములు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. రెండు ఎద్దులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని లింగంపల్లి రస్తాలో రైతులు బారికి పంపా, ఇంద్ర, రవీంద్ర కల్లాలు పక్కపక్కనే ఉన్నాయి. సాయంత్రం కల్లాల్లోని గడ్డివాములకు మంటలు చెలరేగగా స్థానికులు గుర్తించి ఆర్పేందుకు యత్నించారు. రవీంద్ర కల్లంలోని ఉన్న ఎడ్లను కాపాడారు. ఆలూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం కలిగిందని రైతులు పేర్కొన్నారు.

పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

- స్టేట్ అబ్జర్వర్ ఆర్.మస్తాన్‌రావు


అధికారులతో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ ఆర్.మస్తాన్ రావు

గోనెగండ్ల: పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల స్టేట్ అబ్జర్వర్(ఫ్లయింగ్ స్క్వాడ్) ఆర్.మస్తాన్ రావు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం జగనన్న విద్యా కానుక 4వ విడత కిట్ల పంపిణీకి తీసుకుంటున్న ఏర్పాట్లపై ఎంఈఓ వినోద్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

- వెల్దుర్తి: మండల కేంద్రంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం బాలుర జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ ఇందిర తనిఖీ చేశారు. ఇంగ్లీషు పరీక్షకు 824 మంది రెగ్యులర్ విద్యార్థులకు గానూ ఆరుగురు, 19 మంది ప్రైవేట్ విద్యార్థుల్లో ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి 144 సెక్షన్ అమలు చేస్తూ బందోబస్తు కొనసాగిస్తున్నారు.

విద్యాభివృద్ధికి విప్లవాత్మక మార్పులు


కేజీబీవీలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

తుగ్గలి: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోప్పీ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాలని చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి తరగతి గదులు, భోజన నాణ్యతను పరిశీలించారు. కస్తూర్బాల్లో పేద విద్యార్థినులే అధికంగా ఉంటారని, వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అర్థమయ్యేలా పాఠాలు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడి వారిచేత పాఠాలను చదివించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్జేడీ ప్రతాపరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ ఏపీఓ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు ఉన్నారు.

- మద్దికెర: పోషక విలువలు కలిగిన రాగిజావాను వారానికి మూడుసార్లు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బురుజుల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులతో పాటు రాగిజావ రుచి చూసి మెనూ ప్రకారం ఇస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈఓ రంగారెడ్డి, ఎంఈఓ రంగస్వామి ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యం, ఆటో, నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సెబ్ పోలీసులు

ఎమ్మిగనూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో సెబ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, సుధాసాగర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నందవరానికి చెందిన ఉబలి రహంతుల్లా ఆటోలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. 192 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఆటో సీజ్ చేసినట్లు ఎస్ఐలు తెలిపారు.

ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి



- తీవ్రమైన ఎండలు
- మధ్యాహ్నం నుంచే రహదారులు నిర్మానుష్యం
- వ్యవసాయ కూలీలకు తప్పని తిప్పలు


కృష్ణగిరిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

కృష్ణగిరి: ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పగలు ఎండలు, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 9 దాటితే ఇంట్లో ఉక్కపోత, బయటకు వస్తే నడినెత్తిన మంట. ఇక మధ్యాహ్న సమయంలో ఎండలు కొలిమిని తలపిస్తున్నాయి. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవిలో సాధారణంగా ఎక్కువ మందిని ఇబ్బందులకు గురిచేసేది వడదెబ్బ. తీవ్రస్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో శరీర ఉష్ణోగ్రత 40.5 సెల్సియస్ కంటే ఎక్కువైనప్పుడు ఉష్ణోగ్రతను నియంత్రించే మెదడులోని కేంద్రం దెబ్బతినడం వల్ల వడదెబ్బకు గురువుతారు. వారం రోజులుగా మండలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నెల 2న 35డిగ్రీలు నమోదుగాకాగా 3, 4 తేదీల్లో 36 డిగ్రీలు, 5, 6, 7 తేదీల్లో 37 డిగ్రీలు నమోదైంది. 8న 30 డిగ్రీలుగా ఉంది.

వడదెబ్బకు కారణాలు..

వేడిమి ఎక్కువ ఉన్న చోట్ల ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది. శరీరం ఉప్పు కన్నా ఎక్కువ నీటిని కోల్పోతే వడదెబ్బ తగులుతుంది. 65 ఏళ్ల వయస్సు పైబడిన వారు, పసిపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గుండెజబ్బులు, అధిక రక్తపోటు ఉన్నవారు ఈ సమయంలో వడదెబ్బ బారిన పడే అవకాశం ఎక్కువ.

లక్షణాలిలా...

వడదెబ్బ తిగిలితే శరీర ఉష్ణోగత పెరగడం, నాడి వేగంగా కొట్టుకోవడం, తలనొప్పి, తల తిరగడం, పొడిబారిన చర్మం, తడి ఆరిన నాలుక, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళతారు.

ప్రథమ చికిత్స ఇలా..

ఎవరికైనా వడదెబ్బ తగిలిన వెంటనే తడివస్త్రంతో తుడిచి, గాలి తగిలే ప్రదేశంలో కూర్చోబెట్టాలి. చల్లని పదార్థాలు తాగించడం వల్ల కోలుకునే అవకాశం ఉంటుంది. నీరు బాగా తాగించాలి. అందుబాటులో ఉండే ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.

వ్యవసాయ పనులకు బ్రేక్

ఎండ వేడిమికి వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రంగా ఉండటంతో కూలీలు పనులకు రావడం లేదు. దీంతో వ్యవసాయ బోరు, బావుల కింద పంటలు సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత ముందస్తుగా ఎండలు గతంలో ఎప్పుడూ చూడలేదని ప్రజలు అంటున్నారు.

వేసవిలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు

- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు మిట్ట మాధ్యాహ్నం ఎండలో తిరగకుండా ఉండాలి.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగాలి. గొడుగును ఉపయోగించాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు, తలకు టోపీ/ రుమాలు ధరించాలి. నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఆల్కహాలు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. ఇది విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఆల్కహాలకు దూరంగా ఉండటం మంచింది.
- ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలు, తలుపులకు తెరలను వాడాలి. ఫ్యాన్లు, ఎయిల్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు ఉపయోగించవచ్చు.
- ఎండలో పని చేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థానలను తీసుకోవాలి.
- ప్రయాణాలు చేసేటప్పుడు బాటిల్‌లో మంచి నీరు ఉంచుకోవడం మంచింది.
- చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రణాళిక బద్ధంగా ప్రయాణం చేయాలి.
- కూలీలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనులకు వెళ్లరాదు. ఈ సమయంలో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ.

ఇంత ఎండలు ఎప్పుడూ చూడలేదు



ఈసారి ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఎప్పుడూ ఇంత ఎండలను చూడలేదు. ఉదయం 9 గంటల తర్వాత బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో కూడా ఉక్కపోత. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వైశాఖ మాసంలో ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయ పనులకు కూలీలు రావడానికి భయపడుతున్నారు.

– హనుమంతురెడ్డి, అమకతాడు

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవికాలంలో దూర ప్రాంతాలు ప్రయాణం చేసేవారు, కూలీ పనులు చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఎండలు ఎక్కువగా ఉన్నందున వేసవి తాపం తగ్గించాలంటే చిన్నారులు, వృద్ధులకు తరచూ ఎక్కువగా నీరు తాగించాలి. వడదెబ్బ తగిలిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి ఉపశమనం పొందవచ్చు.

– మహేశ్వరప్రసాద్, వైద్యాధికారి, కృష్ణగిరి